రోడ్డు మలుపులు.. మృత్యు పిలుపులు

- ఎక్కడా కనిపించని సూచిక బోర్డులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు




ధర్మారం గేట్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రైతు లక్ష్మాగౌడ్ (ఫైల్)

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే దారుల్లో మూల మలుపులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. దీంతో ఈ రహదారులపై ప్రయాణం అంటేనే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. మూలమలుపులు గమనించక ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోయిన ఘటనలు కోకొల్లలు. మరి కొందరైతే క్షతగాత్రులుగా మిగిలి పోతున్నారు. ప్రమాదకర మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయ్యట్లేదని, ఒకవేళ అక్కడక్కడా ఉన్నా నిర్వహణ లోపం కారణంగా చెట్లపొదల మాటున కనిపించకుండా ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుకునూర్ నుంచి పోతంశెట్టిపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ధర్మారం గేటు, దామరంచ గేటు, కొంగోడు శ్మశానవాటిక వద్ద మలుపులు, వెల్దుర్తి నుంచి జిల్లా కేంద్రం మెదక్ వెళ్లే దారిలోని ఉప్పులింగాపూర్ బ్రిడ్జ్, ఆరెగూడెం గేటు, ఉప్పులింగాపూర్ నుంచి మాసాయిపేటకు వెళ్లేదారిలో ఓ పౌల్ట్రీ ఫారాల వద్ద, ధర్పల్లి సమీపంలో మూలమలుపులు ఉన్నాయి. వీటి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

రహదారికి ఇరువైపుల గుంపుగా చెట్లు

ఈ మలుపుల దగ్గర చెట్లు రహదారికి ఇరువైపుల అల్లుకుపోవడంతో మలుపులు గమనించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో ఈ మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రహదారుల మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేదా స్పీడ్ బ్రేకర్‌లైనా ఏర్పాటు చేయాలని వాహనదారులు వేడుకుంటున్నారు. గతంలో ధర్మారం గేటు మూలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో శివ్వంపేట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన దొంతి లక్ష్మాగౌడ్(48) అక్కడికక్కడే మృతిచెందాడు. దామరంచ మూలమలుపు వద్ద శివ్వంపేట గ్రామానికి చెందిన ఓ కానిస్టేబుల్ ప్రమాదానికి గురయ్యాడు. రామాయిపల్లి–శెట్టిపల్లి ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చెట్ల వల్ల బైక్‌పై వెళ్తున్న ఉప్పులింగాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. రోడ్డుకు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యువాత పడుతున్నారు. దీంతో ఆయా రూట్లలో వెళ్లాలంటే ప్రాణాన్ని గుప్పిట్లో పెట్టుకొని వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. వాహనం వేగంగా ఉన్నా.. ఆదమరిచి వాహనం నడిపినా ప్రమాదాలబారిన పడే పరిస్థితి నెలకొంది. ఆయా రూట్లలో అనేక ప్రమాదకర మలుపులు ఉన్నా అధికారులు సూచికలు ఏర్పాటు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. సూచిక బోర్డులు లేక అకస్మాత్తుగా కనిపించే మలుపులు గుర్తించి తేరుకునే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వాపోతున్నారు. రోడ్డుపై పిచ్చి చెట్లు ఉండటంతో మలుపుల వద్ద దగ్గరకు చేరుకునే వరకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాలలో దగ్గరికి వెళ్లే వరకు మలుపులు కనబడని పరిస్థితి ఉండడంతో ప్రమాదాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తప్పనిసరి తీసుకోవాలి. ముఖ్యంగా మూలమలుపుల వద్ద వేగాన్ని నియంత్రించి నెమ్మదిగా వెళ్లాలి. లేనిపక్షంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని ఢీకొనడం లేదా బోల్తాపడటం వంటి ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ట్రాఫిక్స్ రూల్స్‌పై అవగాహన ఉండి నిబంధనలకు అనుగుణంగా వాహనాన్ని నడపడం వలన ప్రమాదాలను నియంత్రించవచ్చు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

– రాజు, ఎస్‌ఐ, వెల్దుర్తి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పట్టణంలో స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి తన నివాసంలో సోమవారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, నయీమొద్దీన్, మహ్మద్, రాకేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నవీన్ బాధిత కుటుంబీకులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ప్రశాంత్, నర్సింలు, దామోదర్, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో పలు గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర, నాయకులు పరశురాంరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప కల్యాణోత్సవం



చండూర్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న కురుమ సంఘం సభ్యులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని చండూర్‌లో సోమవారం బీరప్ప–కామారతిదేవిల కల్యాణోత్సవం కురుమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కన్నుల పండువగా జరిగిన బీరప్ప కల్యాణాన్ని చూసేందుకు భారీగా భక్తులు తరలివచ్చారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బీరప్ప కల్యాణాన్ని తిలకించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, జగన్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రాజ్‌కుమార్, గోపాల్, శ్రీహరి, ఒగ్గు కళాకారుల బృందం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



వెంకట్‌గౌడ్

నర్సాపూర్ రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందాడు. నర్సాపూర్ మండలం అహ్మద్ నగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పద్మ భర్త బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌గౌడ్(52) ఈనెల 5న నర్సాపూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా గురుకుల పాఠశాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అదే రోజు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ఎల్లమ్మ కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామంలో కొలువైన రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారికి పంచామృతాభిషేకం, శుద్ధోదకస్నానం కార్యక్రమాలతో పాటు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ మంటపంలో అమ్మవారి కల్యాణోత్సవాలను వేడుకగా జరిపారు. ఈ కార్యక్రమానికి రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి హాజరయ్యారు. మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు, అన్నప్రసాద కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మంగళవారం అమ్మవారికి బోనాల ఊరేగింపు ఉంటుందని గ్రామ గౌడ సంఘం, ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

సాగులో ఆధునిక విధానాలు పాటించాలి



రైతులతో పరిశ్రమ ప్రతినిధులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు వ్యవసాయ సాగులో ఆధునిక విధానాలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ ఆర్థికంగా ఎదగాలని ఫ్లెమింగ్ లాబోరేటరీస్ పరిశ్రమ ఎండీ ప్రకాష్ అన్నారు. మండలంలోని నవాబుపేట గ్రామంలో ఫ్లెమింగ్ లాబోరేటరీస్ పరిశ్రమ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన రైతు సంఘం భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సాగులో పాటించాల్సిన అంశాల గురించి చర్చించుకునేందుకు నిర్మించిన భవనం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాభివృద్ధి కోసం తమ పరిశ్రమ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపి పరిశ్రమ ప్రతినిధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు రాంకుమార్, మల్లికార్జున్‌రెడ్డి, మనోహర్, రాజేంద్ర, గ్రామస్తులు నర్సింహారెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణచారి, సురేశ్‌గౌడ్, అంజిరెడ్డి, రాజు, చంద్రరెడ్డి, జంగారెడ్డి, మహేశ్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థులు చదువుతో పాటు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, ఎంఈఓ యాదగిరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రతిభ చాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. అనంతరం మండలంలోని హస్తాల్‌పూర్‌లో సన్నబియ్యం పంపిణీని రాజిరెడ్డి ప్రారంభించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న న్యాయవాది శ్రీనివాస్ గౌడ్

నర్సాపూర్ రూరల్: అందరికీ చట్టాలపై అవగాహన అవసరమని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ సిరి సౌజన్య, సర్వీస్ కమిటీ న్యాయవాదులు శ్రీనివాస్ గౌడ్, స్వరూపరాణి శ్రీనివాస్, సుధాకర్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మండలంలోని నారాయణపూర్ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాలతో మండల్ లీగల్ సర్వీస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, ఫోక్స్ చట్టం, షీ టీం చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ జగన్నాథం, ప్రిన్సిపాల్ లలితాదేవి, న్యాయవాదులు రవి నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవాలు



కౌడిపల్లి(నర్సాపూర్): బండ్ల ఊరేగింపు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలోని అభయ సీతారామాలయం 32వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఆలయ పురోహితుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చనలు, సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులు బండ్లు, ట్రాక్టర్లు ఊరేగించి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో భజన మండల సభ్యులు డాక్టర్ పురుషోత్తం, ఉడుత రాజు, జగన్, దశరథ, బ్రహ్మాచారి, శేషగిరిరావు, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, పెంచలయ్య, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.



అల్లాదుర్గం(మెదక్): ముస్లాపూర్‌లో..

దుర్గమ్మకు బండ్ల ప్రదక్షిణలు

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామంలో దుర్గమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం జాతరలో భాగంగా బండ్ల ప్రదక్షణలు చేశారు. గ్రామస్తులు, చుట్టుపక్క గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు బండ్లను ఉరేగించారు.

క్లుప్తంగా

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ పాష

కౌడిపల్లి(నర్సాపూర్): మెదక్ జిల్లాను సిరిసిల్లా జోన్ నుంచి చార్మినార్ జోన్‌లో కలపాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ పాష ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అనాలోచిత నిర్ణయంతో మెదక్ జిల్లాలను సిరిసిల్ల జోన్‌లో కలిపి జిల్లావాసులకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. దీంతో జిల్లావాసులు దగ్గరగా ఉన్న హైదరాబాద్‌ను కాదని సిరిసిల్లాకు వెళ్లడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లాను సిరిసిల్లాలో కలపడంతో ఉద్యోగ అవకాశాలు, పదోన్నతుల్లో, నిరుద్యోగులకు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఇటీవల జరిగిన పలు ఉద్యోగాల ఎంపికలో చార్మినార్ జోన్ పరిధిలోని విద్యార్థుల కన్న ఎక్కువ మార్కులు సాధించిన సిరిసిల్లా జోన్‌లో ఉద్యోగం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో సీఎం రేవంతర్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం స్పందించి మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని కోరారు.

నిజాంపేట ఎస్‌ఐగా రాజేశ్



నిజాంపేట(మెదక్): మండలానికి నూతన ఎస్‌ఐ బండి రాజేశ్ సోమావారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన కరీంనగర్ జిల్లా చిగురుమామిడి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై మండల పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇంతకు ముందు ఉన్న ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి బదిలీపై వెళ్లారు.

దివ్యాంగుల బస్‌పాస్ మేళా



దరఖాస్తులు తీసుకుంటున్న ఆర్టీసీ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ఆర్టీసీ దివ్యాంగుల కోసం ఏర్పాటు చేస్తున్న బస్‌పాస్ మేళాను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారి శేఖర్ అన్నారు. సోమవారం అల్లాదుర్గంలో దివ్యాంగుల బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఇందులో 16 మంది బస్‌పాస్‌ల కోసం దరఖాస్తు చేసున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి 50 శాతం సబ్సిడీ బస్‌పాస్‌లు అందజేస్తామన్నారు. అల్లాదుర్గం ఐకేపీ కార్యాలయంలో మంగళవారం బస్‌పాస్ మేళా కొనసాగుతుందని చెప్పారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

అల్లాదుర్గం(మెదక్): ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని నడిమితండా, గాండ్లబావి తండాలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకుంటే వెంటనే బిల్లులు అందజేస్తామన్నారు. బెస్మెంట్ నిర్మించుకుంటే రూ. లక్షా బిల్లు ఖాతాలో పడ్తాయని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ ఉన్నారు.

ఆరోగ్య దినోత్సవ ర్యాలీ



పెద్దశంకరంపేటలో అవగాహన ర్యాలీ

పెద్దశంకరంపేట(మెదక్): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు పౌష్టికాహారం, యోగా, వ్యాయామం తదితర అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. తమ ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతీ ఒక్కరూ వైద్యుల సూచనలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది యాదయ్య, సాయిలు, వెంకటేశం, పాల్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులున్నారు.

'రేషన్ దుకాణంలో మోదీ ఫొటో పెట్టాలి'

శివ్వంపేట(నర్సాపూర్): రేషన్ దుకాణాల్లో పీఎం నరేంద్ర మోదీ ఫొటో పెట్టాలని బీజేపీ మండలాధ్యక్షుడు రవి, నాయకులు ఆంజనేయులు, అశోక్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు వారి పార్టీకి చెందిన నేతల ఫొటోల బ్యానర్‌తో సన్నబియ్యం పథకం ప్రారంభించడంపై విస్మయం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫొటోలు లేకుండా రేషన్‌దుకాణం వద్ద బ్యానర్ ఏర్పాటు చేయడంపై తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

రుణాలపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి జాన్‌కెన్నడీ

పెద్దశంకరంపేట(మెదక్): మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలపై వీఓటీలు అవగాహన కల్పించాలని సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి జన్‌కెన్నడీ సూచించారు. సోమవారం పెద్దశంకరంపేటలోని స్త్రీశక్తి భవన్‌లో అల్లాదుర్గం, రేగోడ్, టేక్మాల్, పేట మండలాలకు చెందిన వీఓఎలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సభ్యుల పూర్తి వివరాలను ట్యాబ్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏపీఎంలు, సీసీలు ఉన్నారు.

ఉపాధిహామీ సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం పేట శివారులో కొనసాగుతున్న ఫార్మేషన్ రోడ్డు పనులు ఆయన పరిశీలించారు. కూలీలకు కొలతలు, పనులపై వివరించాలని, వేసవిలో జాగ్రత్తలు పాటించాలని, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం మస్టర్లు, కూలీల హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఏ నవాజుద్దీన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరాములు, టీఏ మోహన్, ఫీల్డ్ అసిస్టెంట్ రమేశ్ ఉన్నారు.

సొసైటీ కార్యదర్శికి పుస్తకాల అందచేత



పుస్తకాలు అందిస్తున్న ఉపాధ్యాయుడు

నర్సాపూర్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు, రచయిత కొండా మురళి తాను రాసిన పలు పుస్తకాలను సోమవారం తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్‌కు అందజేశారు. స్థానిక మైనార్టీ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయుడు కొండా మురళి తాను రాసిన క్రూసేడర్, వేదన, సంకల్పం, పర్సివీరెన్స్ పుస్తకాలు కార్యదర్శికి అందజేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికిలో రేషన్‌షాపువద్ద సోమవారం బీజేపీ నాయకులు పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, రేషన్‌బియ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. కేంద్రం పంపిణీ చేస్తున్న బియ్యాన్ని, రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందని ఆరోపించారు.

◆ **శివాలయం ప్రథమ వార్షికోత్సవం**

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ గ్రామంలో సోమవారం శివాలయం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేకం, హోమం, అన్నదానం చేశారు. రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి కార్యక్రమానికి హాజరై, భక్తి ప్రవచనం చెప్పారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

◆ **ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ**

నర్సాపూర్ రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకంలో చేస్తున్న కూలీలకు సోమవారం బీజేపీ మెదక్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత సహకారంతో కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామ బూత్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

◆ **వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పార్వతి పరమేశ్వరుడి కల్యాణం కమనీయంగా జరిగింది. వేద పండితులు సంతోష్ శర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు పార్వతీపరమేశ్వరుడికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ నరేందర్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, రామ్‌రెడ్డి, లింగమూర్తి పాల్గొన్నారు.

◆ **నూతన స్కూల్ భవనం ప్రారంభం**



రామాయంపేట(మెదక్): పట్టణంలోని మార్కెట్‌లో ఉన్న పాక్షికంగా శిథిలమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని సోమవారం సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. స్కూల్ భవనం పూర్తిగా శిథిలం కాగా పలుమార్లు పత్రికల్లో కథనాలు రాగా కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించారు. ఆయన సూచనతో హైదరాబాద్‌కు చెందిన సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు హాస్టల్ భవనానికి మరమ్మతులు నిర్వహించి, అన్ని వసతులు కల్పించారు. ఇందుకు రూ. 20 లక్షలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఖర్చు చేశారు. ఈమేరకు సెహగల్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయ సెహ్గల్ భవనాన్ని ప్రారంభించారు. స్మార్ట్ తరగతి గదిని ఎంఈవో శ్రీనివాస్, డ్రింకింగ్ వాటర్ పథకాన్ని నవనీత్, గ్రంథాలయాన్ని ఇతర ప్రతినిధులు ప్రారంభించారు.

◆ **జెడ్పీపాఠశాల వార్షికోత్సవం**

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని జెడ్పీపాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు అలరించాయి. సోమవారం రాత్రి జెడ్పీపాఠశాల ఆవరణలో జెడ్పీపాఠశాల హెచ్‌ఎం దీప్లారాథోడ్ అధ్యక్షతన జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతిక నృత్యాలు అలరించాయి. మాజీ సర్పంచ్‌లు శ్రీమాన్‌రెడ్డి, యాదగిరి, ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజ్‌కుమార్‌గౌడ్, పోచయ్య, పీఆర్‌టీయూ అధ్యక్షుడు కృష్ణా, మల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

◆ **నిరవధిక సమ్మె విజయవంతం చేయండి**

మనోహరాబాద్(తూప్రాన్): డిమాండ్‌ల సాధన కోసం తలపెట్టనున్న నిరవధిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సమ్మె నోటీసును మనోహరాబాద్ పంచాయతీ కార్యదర్శి రూపాగౌడ్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తూ తగిన వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంజయ్య, శోభ, బాలమణి, నవనీత, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.